సాక్షి
జనగామ
శుక్రవారం । 6 । అక్టోబర్ । 2023



దుష్టపాలనకు చరమగీతం..

రాష్ట్రంలో దుష్టపాలనకు చరమగీతం పాడడం ఖాయమని ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క అన్నారు. - 8లో▸



హనుమకొండకు హారం

హనుమకొండలో అత్యాధునిక హంగులతో ఆర్టీసీ బస్టేషన్ నిర్మించేందుకు యాజమాన్యం, ప్రభుత్వం నిర్ణయించింది. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $36^0/21^0$

జిల్లాలో ఉదయం నుంచి ఎండ వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమైనా.. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి.

న్యూస్‌రీల్

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



జనగామ: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆల్ పెన్షనర్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారికి అందజేసిన నాయకులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పే రివిజన్ కమిషన్, ఐఆర్ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు అన్యాయం జరుగుతోందన్నారు. పెంచిన ఐఆర్‌ను 2023 జూలై 1 నుంచి ఇవ్వాలని, ప్రతి జిల్లాలో వయో వృద్ధులు, సీనియర్ సిటిజన్లకు ఈహెచ్‌ఎస్ ద్వారా మెరుగైన వైద్యం అందించాలన్నారు. అలాగే ఈ కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎర్రోజు రామస్వామి, ఎండీ.దస్తగిరి, విఠల్‌రెడ్డి, వీరారెడ్డి, ఎ.మల్లారెడ్డి, గాదె క్యాథరిన్, సాల్‌మన్‌రాజు, లక్ష్మయ్య, కృష్ణారావు, యాదగిరి, చంద్రారెడ్డి, పాపయ్య, వెంకటయ్య, లక్ష్మయ్య, పరమాత్మ పాల్గొన్నారు.

నేడు నతీయా ముషాయిరా

జనగామ: మహ్మద్ ప్రవక్త జన్మించిన మాసాన్ని పురస్కరించుకుని మోమిన్ యూత్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నేడు(శుక్రవారం) మిలాద్–ఉన్ నబీతో పాటు నతీయా ముషాయిరా నిర్వహిస్తున్నట్లు సొసైటీ కన్వీనర్, న్యాయవాది మహమ్మద్ జమాల్ షరీఫ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని గిర్నిగడ్డ ఏక్ మినార్ చౌరసా వద్ద చేపట్టే ఈ కార్యక్రమంలో మొదట మహ్మద్ ప్రవక్త ప్రాశస్త్యాన్ని తెలియజేసే కవి సమ్మేళనం ఉంటుందన్నారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేయాలి



జనగామ: నిరుద్యోగులు, ప్రజల విశ్వాసం కోల్పోయిన టీఎస్‌పీఎస్సీ బోర్డును వెంటనే రద్దు చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో స్వేరో స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాదారపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రూప్స్ పరీక్షలు నిర్వహించలేని టీఎస్ పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని, విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి బాధ్యత వహించి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, లేని పక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సంఘాల ప్రతినిధులు రాజు, రాగల్ల ఉపేందర్, నల్ల మహేష్, అజయ్‌గారు, సందీప్, కౌశిక్, పవన్, ధర్మభిక్షం, రాజశేఖర్, నరేష్, రాంప్రసాద్, చందు, స్వాతి, సందీప్, గణేష్, జీడి అనుష్ తదితరులు పాల్గొన్నారు.

50 పడకలకు అప్‌గ్రేడ్

పాలకుర్తి/పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని 30 పడకల ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ గురువారం రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కార్యదర్శి రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా నూతన ఆస్పత్రి ఏర్పాటుకు ప్రభుత్వం రూ.17.50 కోట్లు కేటాయించింది. ఇటీవల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు పాలకుర్తికి వచ్చి సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్థానికుల అభ్యర్థన మేరకు పాలకుర్తి పీహెచ్‌సీని 50 పడకల ఆస్పత్రిగా మారుస్తామని మంత్రి హరీష్‌రావు హామీ ఇచ్చారు. అందులో భాగంగా ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గురుకుల విద్యార్థుల ప్రతిభ



జనగామ: ఉమ్మడి వరంగల్ బాలుర స్పోర్ట్స్, గేమ్స్ మీట్2023–24లో బచ్చన్నపేట గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో మహాత్మా జ్యోతిబాపూలే(ఎంజేపీ) బీసీ వెల్ఫేర్ రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. జి.కార్తీక్ ఉమ్మడి వరంగల్ కెప్టెన్‌గా ఎంపిక కాగా, ఎం.రోహిత్ రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎం.రాజు, ఏటీపీ దేవయ్య, చంద్రమౌళి, పీఈటీ సాంబయ్య, ఉపాధ్యాయులతోపాటు సమన్వయ అధికారి వై.మనోహర్‌రెడ్డి, డీసీఓ అనిత అభినందించారు.

రెండు కార్పొరేషన్ పదవులు

- ఆర్టీసీ చైర్మన్‌గా ముత్తిరెడ్డి, రైతుబంధు సమితి చైర్మన్‌గా రాజయ్య
- ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్
- ఉత్తర్వులు జారీచేసిన సీఎస్, తక్షణం అమలులోకి..
- సిట్టింగ్ టికెట్ల సమస్యకు పరిష్కారం!



ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



తాటికొండ రాజయ్య

జనగామ/స్టేషన్‌ఘన్‌పూర్: జిల్లాకు రెండు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు దక్కాయి. జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి ఆర్టీసీ చైర్మన్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యను రైతు బంధు సమితి చైర్మన్‌గా నియమిస్తూ గురువారం రాత్రి సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణం ఈ ఉత్తర్వులు అమలు లోకి వచ్చేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారు రెండేళ్ల కాలపరిమితితో ఈ పదవుల్లో కొనసాగనున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఈసారి టిక్కెట్ రాకపోవడంతో బుజ్జగించే ప్రయత్నంలో అధిష్టానం రాష్ట్ర స్థాయి పదవులను కట్టబెట్టింది.

ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఇటీవల రాష్ట్రంలోని 115 అసెంబ్లీ సీట్లకు బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించగా.. జనగామ టికెట్ పెండింగ్‌లో ఉంచారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికి అనధికారికంగా జనగామ టికెట్ కన్ఫాం చేయగా, ముత్తిరెడ్డి సైతం బరిలో నేనే అంటూ పట్టుబట్టి కూర్చున్నాడు. మరోవైపు 'పల్లా' వర్గం దూకుడు పెంచుతుండగా, ఎమ్మెల్యే తన అనుచరులతో నియోజకవర్గ పర్యటనలు చేస్తూ.. రాజేశ్వర్‌రెడ్డిపై విమర్శలకు దిగుతున్నాడు. ఇద్దరి పంచాయితీ ప్రతిపక్షాలకు అనుకూలంగా మారేలా ఉండడంతో.. సయోధ్య కుదిర్చేందుకు పార్టీ పెద్దలు ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారం రోజులుగా ముత్తిరెడ్డి ఆరోపణలు గుప్పిస్తుండడంతో వచ్చే ఎన్నికల్లో నష్టం జరిగే ప్రమాదం ఉందని గ్రహించిన సీఎం కేసీఆర్ నేరుగా రంగంలోకి దిగారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండడంతో ఎమ్మెల్యే యాదగిరిరెడ్డిని బుజ్జగించే ప్రయత్నంలో తెలంగాణ ఆర్టీసీ చైర్మన్‌గా నియమిస్తూ రాత్రికి రాత్రే ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్ బాధ్యతలు తక్షణమే తీసుకునేలా చూడాలని పేర్కొన్నారు.

పంచాయితీకి చెక్ పడినట్టేనా..!

జనగామ టికెట్‌పై బెట్టుమీదున్న ముత్తిరెడ్డికి ఆర్టీసీ చైర్మన్ పదవి కట్ట బెట్టడంతో.. 'పల్లా'కు లైన్ క్లియర్ అయినట్టే అని భావిస్తున్నారు. నేడో, రేపో జనగామ టికెట్ అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ముత్తిరెడ్డికి ఆర్టీసీ చైర్మన్ పదవి వచ్చినట్లు తెలుసుకున్న పార్టీ శ్రేణులు, అభిమానులు ఆర్టీసీ చౌరస్తాకు చేరుకుని బాణాసంచా పేల్చి సంబురాలు జరుపుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, నీల రామ్మోహన్, జూకంటి శ్రీశైలం, ముస్త్యాల దయాకర్, బిజ్జాల నవీన్, సేవెల్లి మధు, సలీం తదితరులు పాల్గొన్నారు.

2009 నుంచి బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్‌గా..

తెలంగాణ ఉద్యమ సమయం 2009 నుంచి జనగామ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న ముత్తిరెడ్డి.. 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. అంతకు ముందు పాలకుర్తి, వర్ధన్నపేట ఇన్‌చార్జ్‌గా పనిచేసిన ఆయన ఉప్పల్‌లో బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు.



జనగామ ఆర్టీసీ చౌరస్తాలో పార్టీ శ్రేణుల సంబరాలు

ఒకే గొడుగు కిందకు..

ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యను తెలంగాణ రాష్ట్ర రైతుబంధు సమితి చైర్మన్‌గా నియమించడంతో ఇంతకాలం ఉప్పు నిప్పుగా ఉన్న ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యే రాజయ్య ఒకే గొడుగు కింద పనిచేస్తారని పార్టీ శ్రేణులు భావిస్తున్నారు. వాస్తవానికి మొదటగా దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశీర్వాదంతో కాంగ్రెస్ పార్టీ నుంచి 2009లో ఎమ్మెల్యేగా గెలుపొందిన రాజయ్య.. అనంతరం తెలంగాణ ఉద్యమంతో 2011 అక్టోబర్ 29న టీఆర్‌ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీఆర్‌ఎస్ తరఫున 2012 ఉప ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందారు. తర్వాత 2014, 2018 ఎన్నికల్లో విజయం సాధించారు. వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. ఇటీవల కేటీఆర్ రాష్ట్ర రైతుబంధుసమితి చైర్మన్ పదవి ఇస్తానని చెప్పగా తిరస్కరించానని, ఎంపీగా లేదా ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తామని చెప్పినట్లు స్వయంగా రాజయ్య వెల్లడించారు. కడియం శ్రీహరికి ఘన్‌పూర్ టికెట్ ప్రకటించినప్పటి నుంచి రాజయ్య పలుమార్లు బహిరంగంగా ఆయనపై విమర్శలు చేస్తూనే ఉన్నారు. అయినా శ్రీహరి స్పీడ్ పెంచి ప్రచారం ముమ్మరం చేశారు. ఒకవైపు సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తామంటూనే రాజయ్య పరోక్షంగా శ్రీహరిపై విమర్శలు చేస్తూ వచ్చారు. ఎట్టకేలకు రాజయ్యకు రాష్ట్ర రైతుబంధు సమితి చైర్మన్ పదవి ఇవ్వడంతో ఇద్దరి మధ్య సయోధ్య కుదురుతుందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు.

కేసీఆర్‌పై నమ్మకం ఉంది

ఆర్టీసీ చైర్మన్ ఇవ్వడం సంతోషంగా ఉంది. ఈ విషయాన్ని ఎంపీ సంతోష్ స్వయంగా ఫోన్ చేసి చెప్పారు. జనగామ టికెట్ విషయంలో కేసీఆర్‌పై సంపూర్ణ విశ్వాసం ఉంది. నేడు వరంగల్‌లో జరిగే కార్యక్రమానికి మంత్రి కేటీఆర్‌తో కలిసి వస్తున్నాను.

- ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్యే జనగామ

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటా

రాష్ట్ర రైతుబంధు సమితి చైర్మన్ పదవి ఇస్తానని ఇంతకు ముందే చెప్పారు. అధిష్టానం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటాను. సీఎం కేసీఆర్ ఆదేశాలే శిరోధార్యం. ఇదికూడా హోదా కలిగిన పదవే. ప్రస్తుతం తాను వారణాసిలో ఉన్నాను.

- తాటికొండ రాజయ్య, ఎమ్మెల్యే ఘన్‌పూర్

నేడు కేటీఆర్ పర్యటన

- ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వరంగల్ నగరంలోనే..
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- 'కుడా' గ్రౌండ్స్, ఖిలా వరంగల్‌లో బహిరంగసభలు
- కేటీఆర్ పర్యటన సందర్భంగా భారీగా ఏర్పాట్లు



సాక్షిప్రతినిధి, వరంగల్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు శుక్రవారం వరంగల్ మహానగరంలో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి హెలిక్యాప్టర్‌లో బయలుదేరి ఉదయం 9.30 గంటలకు హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానానికి చేరుకుంటారు. సాయంత్రం 5.30 గంటల వరకు గ్రేటర్ వరంగల్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభం, శంకుస్థాపనలు చేయనున్నారు. సుమారు ఎనిమిది గంటల పాటు నగరంలో కేటీఆర్ వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్న నేపథ్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు. కేటీఆర్ పర్యటన ఖరారైన నేపథ్యంలో మూడు రోజులుగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా.. వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పలుమార్లు సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కేటీఆర్ రాక సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేటీఆర్ పర్యటన నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఇదిలా ఉండగా హనుమకొండ 'కుడా' మైదానం, ఖిలా వరంగల్‌లో వేర్వేరు బహిరంగసభల్లో కేటీఆర్ ప్రసంగిస్తారు. కాగా, కేటీఆర్ పర్యటన సక్సెస్ కోసం గురువారం ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య అధికారులతో సమావేశాలు నిర్వహించారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన అవసరం

- మేనేజర్ అబ్దుల్ ఎజాజ్ ఖాన్

జనగామ: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ సాంకేతికతను సద్వినియోగం చేసుకోవడంతో పాటు డిజిటల్ చెల్లింపులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎస్‌బీఐ డిజిటల్ బ్యాంక్ జనగామ మేనేజర్ అబ్దుల్ ఎజాజ్ ఖాన్ అన్నారు. డిజిటల్ చెల్లింపులపై జిల్లా కేంద్రంలోని ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహమ్మద్ అఫ్జల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డిజిటల్ బ్యాంకులో నూతన ఖాతా ప్రారంభం, ఈకేవైసీ, డిజిటల్ లావాదేవీలు, విత్ డ్రాయల్, నెట్ బ్యాంకింగ్ సిస్టమ్ తదితర పద్ధుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా వివరించారు. అసిస్టెంట్ మేనేజర్ మనోజ్ మాట్లాడుతూ నకిలీ ఏటీఎం కార్డులు, పిన్ నంబర్ మార్పు చేయడం, సైబర్ ఫోన్‌కాల్స్ వచ్చిన సమయంలో అప్రమత్తత, మోసపోయిన బాధితులు సైబర్ క్రైంలో ఫిర్యాదు ఎలా చేయాలనే తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ వస్కుల శ్రీనివాస్, మరిపెల్ల రవిప్రసాద్, శ్రీకాంత్ రెడ్డి, అనిల్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేనేజర్

దమ్ముంటే అభివృద్ధికి నిధులు ఇవ్వాలి

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

తరిగొప్పుల: ప్రధాని నరేంద్ర మోదీకి దమ్ముంటే తెలంగాణ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రూ.2.70 కోట్ల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ విద్యాలయం నూతన భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన 26 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను జెడ్పీటీసీ ముద్దసాని పద్మజావెంకట్‌రెడ్డితో కలసి పంపిణీ చేశారు. పాఠశాల ప్రత్యేక అధికారి గోవిందు రజిత అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాలయాల ఏర్పాటు, సాగు, తాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, కుల వృత్తులకు ఆర్థిక చేయూత, పట్టణీకరణ, సంక్షేమ పథకాల అమలు సీఎం కేసీఆర్ పరిపాలన దక్షతకు నిదర్శనమని కొనియాడారు. పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులపై సభలో ఎప్పుడైనా ప్రశ్నించారా అని అన్నారు. జనగామ మెడికల్ కాలేజీకి కేంద్రం రూ.200 కోట్లు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్వరలోనే మండలంలో నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. డీఈఓ రాము, సర్పంచ్ దామెర ప్రభుదాస్, ఎంపీటీసీలు అర్జుల మధుసూదన్‌రెడ్డి, భూక్య జుంలాల్‌నాయక్, మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి, అర్జుల సుధాకర్‌రెడ్డి, జొన్నగోని సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




కేజీబీవీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా..

- బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రజలు ఒక్కసారి ఆశీర్వదించి అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ పార్టీ ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. మండల పరిధి చంద్రుతండా, కోమటిగూడెం, రంగరాయగూడెం, సముద్రాల, ఇప్పగూడెం, అక్కపెల్లిగూడెం గ్రామాల్లో గురువారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. తనకు వ్యక్తిగత ఎజెండా అంటూ ఏమీ లేదని.. అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ముఖ్యమన్నారు. నేను ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా, ఉపముఖ్యమంత్రిగా, ఎమ్మెల్సీగా పనిచేశానని, నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతోనే ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు. గతంలో ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు కోమటిగూడెం, రంగరాయగూడెం, ఇప్పగూడెం, సముద్రాల, అక్కపెల్లిగూడెం గ్రామాలు జనగామ నియోజకవర్గంలో ఉండేవని, అప్పుడు అభివృద్ధి చేసే అవకాశం రాలేదని, ప్రత్యేక చొరవతో పనిచేస్తానని, కోమటిగూడెం గ్రామాన్ని దత్తత తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, నాయకులు పోగుల సారంగపాణి, నెలమంచ అజయ్‌రెడ్డి, తోట వెంకన్న, నాగరబోయిన యాదగిరి, సర్పంచ్‌లు రాజు, గూడెల్లి అశోక్, జక్కుల పరుశరాములు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



రంగరాయగూడెంలో మాట్లాడుతున్న శ్రీహరి

స్థానికుడిని.. ఆశీర్వదించండి

- మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ రూరల్: గతంలో చేర్యాలను అభివృద్ధి చేసిన ఘనత నాదే.. జనగామను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యతా నాదే.. స్థానిక బిడ్డను.. కష్టసుఖాలు తెలిసినోడిని ఆశీర్వదించాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం వడ్లకొండ, గానుగుపహాడ్‌లో 'కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాల'పై ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన గానుగుపహాడ్‌లో మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూంలు ఇస్తామని, దళితులకు మూడెకరాల భూమి, దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల నుంచి ప్రజలను మోసం చేస్తున్నదని, వీటిలో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. గతంలో ఇచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లే ప్రస్తుతం కనబడుతున్నాయని చెప్పారు. సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాల పేరుతో లక్షల కోట్లు దోచుకున్నాడని విమర్శించారు. రెండు దఫాలు గెలుపొందిన ముత్తిరెడ్డి జనగామలో భూకబ్జాలతో రూ.వేలకోట్లు దండుకున్నాడని, ఇప్పుడు మరోమారు దోచుకోవడానికి వస్తున్నాడని ఆరోపించారు. స్థానికేతరులు గ్రామాల్లోకి వస్తే తరిమికొట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర కోఆర్డినేటర్ సుంకరి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు లింగాల నర్సిరెడ్డి, నర్సింగరావు, ధర్మేంద్ర, అనిల్, పిట్టల సతీష్, ఉడుత రవి తదితరులు పాల్గొన్నారు.



గానుగుపహాడ్‌లో మాట్లాడుతున్న కొమ్మూరి

ఏబీవీపీ ఆందోళన ఉద్రిక్తం

- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ, గ్రూప్–1 రద్దుపై న్యాయ విచారణకు డిమాండ్
- రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మతో శవయాత్ర
- రాస్తారోకో.. నాయకుల అరెస్ట్



జిల్లా కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తున్న ఏబీవీపీ శ్రేణులు

జనగామ: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ, గ్రూప్–1 రద్దుపై సమగ్ర న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం తలపెట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. జిల్లా కేంద్రం ఆర్టీసీ చౌరస్తాలో ఏబీవీపీ వరంగల్ విభాగ్ కన్వీనర్ చింతకింది సంతోష్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మతో నిర్వహించిన శవయాత్రలో రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. దిష్టిబొమ్మ దహనం చేసే క్రమంలో పోలీసులు అడ్డుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. నాయకులు, విద్యార్థులు రోడ్డుకు అడ్డంగా బైఠాయించడంతో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. అయినా కదలక పోవడంతో పలువురిని బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. అనంతరం చింతకాయల ఝాన్సీ మాట్లాడుతూ ప్రభుత్వం పదేళ్లుగా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా, పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లుతోందన్నారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సెక్రెటరీలను పదవుల నుంచి తొలగించి వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చింతకింది సంతోష్ మాట్లాడుతూ పేపర్ లీకేజీ, గ్రూప్–1 రద్దుకు నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని, గ్రూప్–1 పరీక్షను ఎన్నికలకు ముందే తిరిగి నిర్వహించి ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్ సాయి, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ హర్ష, నగర కార్యదర్శి వంశీ, అరవింద్, నవీన్, కార్తీక్, నరేష్, కర్ణాకర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

జనగామ రూరల్: ఉపాధ్యాయులకు ప్రమోషన్లతో పాటు బదిలీలు నిర్వహించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం టీపీటీఎఫ్, డీటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమోషన్లు, బదిలీలపై అధికారులు పూటకో మాట మాట్లాడుతున్నారని, న్యాయ సంబంధమైన విషయాలు పరిష్కరించాలన్నారు. డీఎస్సీ పోస్టులు నింపే వరకు ఏర్పడిన ఖాళీల్లో తాత్కాలింగా వలంటీర్లను నియమించాలని, 18 శాతం ఐఆర్, మూడు డీఏ బిల్లులు ఇతర పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లక్ష్మయ్య, చొక్కయ్య, అంకుషావలి, సత్యనారాయణ, వజ్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

జనగామ రూరల్: కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అభిగౌడ్ అన్నారు. గురువారం పట్టణ పరిధి 13వ వార్డులో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కాంగ్రెస్ గెలుపు కోసం పార్టీ తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి ఒక్కరూ ముందుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం వార్డు అధ్యక్షుడిగా నాగేష్‌ను నియమించారు. ఈశ్వర్, గుణశేఖర్, రాకేష్, వేణు, పవన్, అశోక్, అక్షయ్, మల్లికార్జున్, నందు జగదీష్, వెంకటేష్, సాయి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు స్కూళ్లలో బ్రేక్‌ఫాస్ట్

- నేటి నుంచి ప్రారంభం
- 1 నుంచి 10 తరగతుల వరకు అమలు
- స్కూల్ టైంకు 45 నిమిషాల ముందు..

జనగామ: సర్కారు స్కూళ్లలో నాణ్యమైన విద్యతో పాటు కనీస మౌలిక వసతులపై దృష్టి సారించిన ప్రభుత్వం.. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. మనఊరు–మనబడి ప్రోగ్రాంతో పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్న సీఎం కేసీఆర్ సర్కారు.. విద్యార్థులకు అన్ని రకాల పోషకాలు అందేలా శుక్రవారం(నేడు) నుంచి బ్రేక్‌ఫాస్ట్ (అల్పాహారం) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 1 నుంచి పదో తరగతి వరకు చదువుకునే విద్యార్థులకు నిత్యం పాఠశాల సమయానికి 45 నిమిషాల ముందు బ్రేక్‌ఫాస్ట్ అందించనున్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 503 ఉండగా 38వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పిల్లలకు చదువుతో పాటు పోషకల విలువలతో కూడిన ఆహారం అందించడానికి సోమవారం నుంచి శనివారం వరకు ప్రత్యేక మెనూ అమలు చేస్తున్న ప్రభుత్వం.. అల్పాహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పాఠశాలల్లో ఉదయం 8.45 గంటలకు బ్రేక్‌ఫాస్ట్ అందించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో డీఈఓ, పాఠశాల స్థాయిలో హెచ్‌ఎం, నోడల్ ఆఫీసర్లు పర్యవేక్షించాల్సి ఉంటుంది. పీఆర్, మహిళా అభివృద్ధి, శిశు సంరక్షణ శాఖల సమన్వయంతో ఈ పథకం అమలు చేయనుండగా, మొబైల్ అప్లికేషన్, ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ ద్వారా బ్రేక్‌ఫాస్ట్‌కు సంబంధించిన ట్రాకింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు.

రోజుకో రకం అల్పాహారం..

సోమవారం : ఇడ్లీ, సాంబార్ లేదా గోధుమరవ్వ ఉప్మా, చెట్నీ
మంగళవారం : పూరి, ఆలూ కుర్మా లేదా టమాటాబాత్ విత్‌రవ్వ, చట్నీ
బుధవారం : ఉప్మా, సాంబార్ లేదా కిచిడీ, చట్నీ
గురువారం : మిల్లెట్ ఇడ్లీ, సాంబార్ లేదా పొంగల్, సాంబార్
శుక్రవారం : ఉగ్గాని/పోహా మిల్లెట్ ఇడ్లీ, చట్నీ లేదా గోధుమరవ్వ కిచిడీ, చట్నీ
శనివారం : పొంగల్, సాంబార్ లేదా వెజిటబుల్ పొలావ్, రైతా/ఆలూ కుర్మా

నేడు ప్రారంభం ఎక్కడ అంటే..

పాలకుర్తి మండలం వావిలా జెడ్పీహెచ్‌ఎస్‌లో మంత్రి దయాకర్‌రావు, జనగామ మండలం వడ్లకొండ జెడ్పీఎస్ఎస్‌లో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రఘునాథపల్లి మండలం నిడిగొండ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య చేతుల మీదుగా అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. కలెక్టర్ శివలింగయ్య, డీఈఓ రాము, ఇతర శాఖల అధికారులు పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి.

బొడ్డెమ్మ వేడుకలు షురూ..

జనగామ/చిల్పూరు : బతుకమ్మ పండుగకు తొమ్మిది రోజుల ముందు జరుపుకునే బొడ్డెమ్మ వేడుకలు గురువారం జిల్లా వ్యాప్తంగా మొదలయ్యాయి. మొదటిరోజు వాడవాడలా చిన్నారులు సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆడి పాడారు.



జనగామ గోకుల్‌నగర్‌లో బొడ్డెమ్మ ఆడుతూ..

క్లుప్తంగా

బీవోఎస్‌గా శంకరయ్య బాధ్యతల స్వీకరణ


మంథిని శంకరయ్య

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని తెలుగు విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా ఆ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ఆచార్యుడు మంథిని శంకర్‌ను నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం బీవోఎస్‌గా ఉన్న ప్రొఫెసర్ బన్న ఐలయ్య నుంచి శంకరయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఐలయ్య తెలుగు విభాగం అధిపతిగా, ఆర్ట్సడీన్‌గా, యూనివర్సిటీ ఆర్ట్స్అండ్‌సైన్స్‌కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు.

పొలిటికల్ సైన్స్ విభాగ అధిపతిగా వీరస్వామి



విద్యారణ్యపురి: కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగ అధిపతిగా ఆ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె వీరస్వామిని నియమించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పొలిటికల్ సైన్స్ విభాగంలో ఒక్కరు కూడా రెగ్యులర్ అధ్యాపకులు లేరు. దీంతో దూరవిద్య కేంద్రం జాయింట్ డైరెక్టర్, సైకాలజీ విభాగం అధిపతి, సీడీసీడీన్‌గా ఉన్న ఆచార్య రాంచంద్రం పొలిటికల్‌సైన్స్ విభాగ అధిపతిగా కొనసాగిస్తూ వస్తున్నారు. రెగ్యులర్ అధ్యాపకులు లేకపోవడంతో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ వీరస్వామిని విభాగం అధిపతిగా నియమించారు.

ఏఆర్‌ల అంతర్గత బదిలీ

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో వివిధ విభాగాలు, కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ల (ఏఆర్)ను అంతర్గతంగా బదిలీలు చేశారు.ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టిశ్రీనివాస్‌రావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కళాశాలలో ఏఆర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ ఎం నర్సింహారావును పరీక్షల విభాగంలో ఎస్‌డీఎల్‌సీఈ విభాగానికి, ఎస్‌డీఎల్‌సీఈలో ఏఆర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సరళా దేవిని ఆర్ట్స్అండ్‌సైన్స్ కళాశాలకు బదిలీ చేశారు.

మరో ముగ్గురు ఏఆర్‌లకు అదనపు బాధ్యతలు

కేయూలోని పరిపాలనాభవనంలో టీచింగ్ విభాగంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న పెండ్లి అశోక్‌బాబుకు అడ్మినిస్ట్రేషన్ నాన్ టీచింగ్ విభాగం అదనపు బాధ్యతలు అప్పగించారు. పరీక్షల విభాగం అండ్ సీడీసీ డీన్ కేయూ ఏఆర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆర్ వెంకటేశ్వర్లుకు అదనంగా ఉమెన్స్ ఇంజనీరింగ్ కాలేజీకి ఏఆర్ బాధ్యతలు అప్పగించారు, కేయూ అకడమిక్ బ్రాంచ్‌లో ఏఆర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కోలాశంకర్‌కు యూనివర్సిటీ ఫార్మసీ కాలేజీకి ఏఆర్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీచేశారు.

హనుమకొండకు హారం..

అత్యాధునిక హంగులతో నూతన బస్ స్టేషన్

- రూ.83 కోట్లతో నిర్మాణం
- 35 ప్లాట్స్ ఫామ్స్,సెల్లార్‌లో పార్కింగ్
- గ్రౌండ్ ఫ్లోర్‌లో బస్ స్టేషన్
- నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి కేటీఆర్


ప్రతిపాదిత నూతన బస్ స్టేషన్ గ్రౌండ్ ఫ్లోర్ నమూనా

హన్మకొండ: హనుమకొండలో అత్యాధునిక హంగులతో బస్ స్టేషన్ నిర్మించేందుకు టీఎస్ ఆర్టీసీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రూ.83 కోట్లతో చేపట్టడానికి ప్రణాళిక రూపొందించారు. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, మొదటి, రెండో అంతస్తులతో ఈ బస్‌స్టేషన్ నిర్మించనున్నారు. శుక్రవారం రాష్ట్ర పురపాలక, నగరాభివృద్ధి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ నూతన బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. భవిష్యత్‌లో ట్రాఫిక్, వాహనాల సంఖ్య పెరిగినా ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా నిర్మించనున్నారు.

బహుముఖ వ్యూహంతో బస్‌స్టేషన్ నిర్మాణం..

ప్రస్తుతం హనుమకొండ బస్ స్టేషన్‌ను బహుముఖ వ్యూహంతో నిర్మించనున్నారు. బస్ స్టేషన్ నిర్మించే క్రమంలో ప్రయాణికుల వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. దీని కోసం ప్రత్యేకంగా సెల్లార్ నిర్మించనున్నారు. 170 కార్లు, 200 ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసేలా సెల్లార్ చేపట్టనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రయాణికులను బస్సులోకి ఎక్కించుకునేందుకు 35 ప్లాట్ ఫామ్స్ నిర్మిస్తారు. ఇదే ఫ్లోర్‌లో ప్రయాణికుల విశ్రాంతి గది నిర్మించనున్నారు. దీంతో పాటు షాపింగ్ కాంప్లెక్స్, క్యాంటీన్, కార్గో–పార్సిల్ సర్వీస్ కార్యాలయం నిర్మించనున్నారు.

రోజు 2లక్షల మంది ప్రయాణికుల చేరవేత..

హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి రోజు మామూలు సమయంలో గంటకు 200, పీక్ టైమ్‌లో 350 బస్సులు వచ్చి వెళ్తుంటాయి. రోజుకు 1100 బస్సులు ఈ బస్ స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు 2 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని 70,900 చదరపు అడుగుల్లో గ్రౌండ్ ఫ్లోర్ నిర్మించనున్నారు. మొదటి అంతస్తులో ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంతో పాటు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తారు. 49,500 చదరపు అడుగుల్లో మొదటి అంతస్తు నిర్మించనున్నారు. రెండో అంతస్తును 27 వేల చదరపు అడుగుల్లో నిర్మిస్తారు. ఈ ఫ్లోర్‌లో ఆడిటోరియంతో పాటు వాణిజ్య సముదాయం ఉంటుంది.

1974లో హనుమకొండ బస్ స్టేషన్ ప్రారంభం

హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ ఆవరణలో వరంగల్ రీజియన్ కార్యాలయంతో పాటు నిర్మించిన బస్ స్టేషన్‌ను 1974 మార్చిలో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ప్రారంభించారు. ఇదే ఆవరణలో 12 ప్లాట్ ఫామ్స్‌తో నిర్మించిన బస్ స్టేషన్ 1990 నవంబర్‌లో అప్పటి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మాదాడి నర్సింహారెడ్డి ప్రారంభించారు. అనంతరం దీనిని సిటీ బస్ స్టేషన్‌గా మార్చారు.

'కుడా' మైదానంలో తాత్కాలిక బస్ స్టేషన్

నూతన బస్ స్టేషన్ నిర్మించనున్న క్రమంలో హనుమకొండ బాలసముద్రంలోని 'కుడా' (హయగ్రీవచారి) మైదానంలో తాత్కాలిక బస్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. వచ్చే ఫిబ్రవరిలో జరిగే మేడారం జాతరకు ఆటంకం కలుగకుండా ఏర్పాటు చేయనున్నారు. మేడారం జాతరకు బస్సులను ఇదే మైదానం నుంచి నడుపుతారు. ఈ క్రమంలో జాతర వరకు తాత్కాలిక బస్ స్టేషన్ నిర్మాణం జరిగే అవకాశం లేదు. జాతర తర్వాతే హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నిర్మాణ పనులు మొదలుకానున్నాయి.

శంకుస్థాపనకు ఏర్పాట్లు



హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నిర్మాణ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేశాం. రూ.83 కోట్లతో అత్యాధునిక హంగులతో ఈ బస్ స్టేషన్‌ను నిర్మించనున్నాం. నిర్మాణ సమయంలో ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా 'కుడా' మైదానంలో తాత్కాలిక బస్ స్టేషన్ ఏర్పాటు చేస్తాం.

–జె.శ్రీలత , ఆర్టీసీ ఆర్ఎం, వరంగల్

కేటీఆర్ పర్యటన విజయవంతం చేయాలి


అధికారులకు జాగ్రత్తలు వివరిస్తున్న చీఫ్‌విప్


మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్

హన్మకొండ: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి రాష్ట్ర పురపాలక, నగరాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని మున్సిపల్ అతిథి గృహంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఇటీవల నిర్మించిన ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులు పరిశీలించారు. తర్వాత హయగ్రీవాచారి మైదానంలో బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, 'కుడా' చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పర్యటనపై హనుమకొండ కలెక్టర్ సమీక్ష

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్లు పక్కాగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. మంత్రి కేటీఆర్ పర్యటనపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మంత్రి కేటీఆర్.. జిల్లాలో పర్యటిస్తారన్నారు. రూ.900 కోట్లతో చేపట్టనున్న, చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారని వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధశుక్లా, డీసీపీ బారి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సభ పనుల పరిశీలన


ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ఖిలా వరంగల్: రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సభ ఏర్పాట్ల పనులను గురువారం సాయంత్రం కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. సుమారు 60 వేల మందిపైగా కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. మంత్రులు స్టేజీ వద్దకు చేరుకునే రోడ్డు మార్గం, బహిరంగ సభ తర్వాత బయటకు వెళ్లేందుకు ప్రత్యేక వీఐపీ గేట్, పార్కింగ్ స్థలాల ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీఓ వాసు చంద్ర, తహసీల్దార్లు ఎక్బాల్, నాగేశ్వరరావు, సీఐ సురేష్ పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

వరంగల్ అర్బన్ : రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖమంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను మేయర్ గుండు సుధారాణి పరిశీలించారు. గురువారం రాత్రి ల్యాండ్ మార్ట్, అలంకార్ జంక్షన్, తదితర ప్రాంతాల్లో పర్యటించి అధికారులను అప్రమత్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు రాజయ్య, సంజయ్ కుమార్, డీఈ రవికుమార్ తదితరులు పాలొన్నారు.

ఏర్పాట్లు చేయండి

మంత్రి కేటీఆర్ శుక్రవారం వరంగల్ నగర పర్యటనకు రానున్న సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని గ్రేటర్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. కమిషనర్, అధికారులు మంత్రి కేటీఆర్ పర్యటించే ప్రాంతాలను గురువారం సందర్శించి, ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సుబేదారి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, మడికొండలో ప్రారంభించనున్న క్వాడ్రంట్ ఐటీ టెక్నాలజీస్, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్, అలంకార్ జంక్షన్ తదితర ప్రాంతాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఖిలా వరంగల్‌లో జరిగే సంక్షేమ సభకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ముగిసిన విద్యుత్ ఉద్యోగుల క్రీడలు

- అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్ తమిళనాడు
- బెస్ట్ అథ్లెట్‌గా ఏపీకి చెందిన నాగులు


అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకుంటున్న తమిళనాడు

హన్మకొండ: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో తెలంగాణ ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ గురువారం ముగిశాయి. నాలుగు రోజుల నుంచి హోరాహోరీగా సాగుతున్న పోరులో ఆరు రాష్ట్రాల నుంచి క్రీడాకారులు తలపడగా తమిళనాడు క్రీడా బృందం పతకాల వేటలో దూసుకెళ్లింది.

అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్‌షిప్ తమిళనాడు

అథ్లెటిక్స్ 19 ఈవెంట్లలో జరిగిన పోటీల్లో తమిళనాడు క్రీడాకారులు ముందు వరుసలో నిలిచారు. 75 పాయింట్లు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. 53 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం, 17పాయింట్లతో ఉత్తర్‌ప్రదేశ్ మూడో స్థానంలో నిలిచాయి. బెస్ట్ అథ్లెట్‌గా ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు కేవీ నాగులు ట్రోఫీ దక్కించుకున్నాడు.

బాల్‌బ్యాడ్మింటన్ విజేత..

బాల్‌బ్యాడ్మింటన్ పోరులో తమిళనాడు విజేతగా నిలిచింది. రన్నప్‌గా ఆంధ్రప్రదేశ్, తృతీయ స్థానంలో కర్ణాటక జట్లు నిలిచాయి. బెస్ట్ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుడిగా తమిళనాడుకు చెందిన మదన్ ట్రోఫీ దక్కించుకున్నాడు.

బహుమతుల ప్రదానం

ముగింపు వేడుకలకు టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ బి నర్సింగరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీ, పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. క్రీడలతో స్నేహ పూర్వక సంబంధాలు బలపడుతాయన్నారు. టీఎస్ ట్రాన్స్‌కో స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కుమార్ వడివేలు, టీఎస్ ఎన్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, వరంగల్ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి కేవీ జాన్సన్, టీఎస్ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు గణపతి, సంధ్యారాణి, మోహన్ రెడ్డి, స్పోర్ట్స్ కౌన్సిల్ సభ్యులు పి రాజారెడ్డి, విజేందర్‌రెడ్డి, సత్యనారాయణ, దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, టీఎస్ఎన్పీడీసీఎల్ హెచ్ఆర్‌డీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మొదటి రోజు విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు.

మెడికల్ ఆఫీసర్ నియామకానికి ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఆరోగ్య కేంద్రంలో ఫుల్‌టైం మెడికల్ ఆఫీసర్ నియామకానికి ఈనెల 7న సాయంత్రం 4గంటలకు క్యాంపస్‌లోని పరిపాలనాభవనంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, ఉద్యోగులు అధ్యాపకులు, రిటైర్డ్ ఉద్యోగులకు సేవలందించాల్సింటుందన్నారు. ఎంబీబీఎస్ అర్హత కలిగి ఉండి ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

ముస్తాబైన క్వాడ్రంట్ టెక్‌నాలెడ్జ్ సెంటర్


క్వాడ్రంట్ టెక్‌నాలెడ్జ్ సెంటర్

మడికొండ: కాజీపేట మండలం మడికొండ ఐటీ కారిడార్‌లోని క్వాడ్రంట్ టెక్‌నాలెడ్జ్ సెంటర్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. శుక్రవారం ఐటీ శాఖ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఈ సెంటర్‌ను ప్రారంభించనున్నారు. ఈ కంపెనీలో సుమారు 500 మందికి ఉద్యోగాలు లభించనున్నట్లు తెలిపారు.

నగరంలో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

- వరంగల్ సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం : పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు నేడు నగరానికి విచ్చేస్తున్న మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో వరంగల్, హనుమకొండ, కాజీపేట పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వి రంగనాథ్ తెలిపారు. ఈ ఆంక్షలు శుక్రవారం ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు.

భారీ వాహనాలు ఇలా..

ములుగు, భూపాలపల్లి వైపు నుంచి హైదరాబాద్ చేరుకోవాల్సిన భారీ వాహనాలు ఆరెపల్లి వద్ద ఔటర్ రింగ్ రోడ్డు నుంచి వెళ్లాలి. భూపాలపల్లి, పరకాల నుంచి ఖమ్మం చేరుకోవాల్సిన వాహనాలు ఆరెపల్లి వద్ద ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కరుణాపురం, మడికొండ, కడిపికొండ, నాయుడు పెట్రోల్ పంపు నుంచి వెళ్లాలి.

- భూపాలపల్లి, పరకాల నుంచి నర్సంపేట వైపు వెళ్లాల్సిన వాహనాలు కొత్తపేట, రెడ్డిపాలెం, జాన్‌పిరీలు, గొర్రెకుంట మీదుగా వెళ్లాలి.
- భారీ వాహనాలు సిటీ బయటే నిలిపివేయాలి.

మంత్రి పర్యటన ముగిసే వరకూ భారీ వాహనాలకు సిటీలోకి అనుమతి లేదు.

నగరంలో రాకపోకలు సాగించే వాహనాలకు ట్రాఫిక్ ఆంక్షలు..

- ములుగు, పరకాల వైపు నుంచి వచ్చే బస్సులు వయా పెద్దమ్మగడ్డ నుంచి కేయూసీ, సీపీఓ, అంబేడ్కర్ సెంటర్, ఏషియన్ శ్రీదేవిమాల్ మీదుగా బస్టాండ్ చేరుకోవాలి.
- హనుమకొండ బస్టాండ్ నుంచి బయలుదేరి ములుగు, కరీంనగర్ వైపునకు వెళ్లే బస్సులు వయా ఏషియన్ శ్రీదేవి మాల్, అంబేడ్కర్ సెంటర్, సీపీఓ ద్వారా కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ మీదుగా వెళ్లాలి.
- హనుమకొండ బస్టాండ్ నుంచి నర్సంపేట, కొత్తగూడెం, భద్రాచలం, తొర్రూరు, ఖమ్మం వైపునకు వెళ్లాల్సిన బస్సులు వయా బాలసముద్రం, ఆదాలత్, హంటర్‌రోడ్డు మీదుగా వెళ్లాలి.
- వరంగల్ బస్టాండ్ నుంచి హనుమకొండ వైపు వచ్చే బస్సులు చింతల్ బ్రిడ్జి నుంచి రంగశాయిపేట మీదుగా నాయిడు పెట్రోల్ పంప్ సెంటర్, ఉర్సుగుట్ట, ఆదాలత్, బాలసముద్రం రోడ్డు మీదుగా హనుమకొండకు చేరుకోవాలి.

మోటార్లు చోరీ చేస్తున్న ఇద్దరి అరెస్టు

- రూ.1.44 లక్షల విలువైన 13 యంత్రాలు స్వాధీనం


చోరీ వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రవీందర్

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యవసాయ పొలాల్లో వ్యవసాయ మోటార్ల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ తెలిపారు. ఈమేరకు గురువారం పోలీస్‌స్టేషన్‌లో చోరీల వివరాలను విలేకరులకు వెల్లడించారు. పీఎస్ పరిధిలో వ్యవసాయ మోటార్లు అపహరణకు గురవుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో సీఐ మహేందర్ ఎస్సై శ్రీకాంత్, ఏఎస్ఐ ఉప్పలయ్య నేతృత్వంలో బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బృందాలు దర్యాప్తు చేస్తున్న క్రమంలో చోరీ చేసిన మోటార్లను అమ్ముతున్న హైదర్‌ను అదుపులోకి తీసుకుని విచారించడంతో వివరాలు తెలిశాయన్నారు. ఇటుక బట్టీల్లో కూలీ చేస్తున్న హైదర్‌కు 11మంది సంతానం. వీరిని పోషించేందుకు కూలీ డబ్బు సరిపోకపోవడంతో చోరీలను ఎంచుకున్నారన్నారు. బట్టీల ప్రాంతంలోని వ్యవసాయ పొలాల వద్ద వ్యవసాయ మోటార్లను చోరీ చేసి పాత ఇనుప సామాన్లు కొనుగోలు చేసే గంధం పోశాలకు విక్రయిస్తున్నాడు. దీంతో ఇద్దరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు. కార్యక్రమంలో మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి యువతి మృతి


శిరీష(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ట్రాక్టర్ పైనుంచి పడి ఓ యువతి మృతి చెందింది. ఈ ఘటన గురువారం మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధి శనిగపురం శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం శనిగపురం గ్రామ శివారు కుమ్మరి కుంట్ల తండాకు చెందిన మాలోత్ మహేష్, శిరీష (28) దంపతులు తమ ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ కోసం జిల్లా కేంద్రానికి వచ్చారు. పని పూర్తయ్యాక ఇంటికి వెళ్తున్న క్రమంలో మహేష్ ట్రాక్టర్ నడుపుతుండగా, శిరీష ఇంజన్ భాగంలో ఎడమ వైపున కూర్చుంది. ట్రాక్టర్ శనిగపురం శివారు శ్రీరామ ఆలయం సమీపంలోకి చేరుకోగానే శిరీష కళ్లు తిరిగి ట్రాక్టర్ పైనుంచి కింద పడింది. తీవ్ర గాయాలైన ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా మృతిచెందింది. ఈఘటనపై బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని మహబూబాబాద్ రూరల్ ఎస్సై రాంచరణ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..



దుగ్గొండి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తొగర్రాయిలో జరిగింది. గ్రామానికి చెందిన నరిగె ఎర్ర కొంరయ్య(55) బుధవారం ఆత్మకూరు మండలం పెంచికలపేట గ్రామంలో తమ బంధువు మృతి చెందడంతో వెళ్లారు. అంత్యక్రియల అనంతరం సాయంత్రం ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నాడు.ఈ క్రమంలో లక్ష్మీపురం –కేశవాపురం గ్రామాల మధ్య చైన్ పడి వాహనం అదుపు తప్పి కిందపడింది. దీంతో కొంరయ్యకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రుడిని ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడు నరిగె భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ అంగన్‌వాడీ టీచర్..


సంధ్యారాణి(ఫైల్)

టేకుమట్ల(గోరికొత్తపల్లి): కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యకు యత్నించిన ఓ అంగన్‌వాడీ టీచర్.. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కొత్తపల్లి గోరి మండలం జగ్గయ్యపేటలో జరిగింది. గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ గంప సంధ్యారాణి(45) కొంతకాలంగా కడుపు నొప్పితో తీవ్ర ఇబ్బంది పడుతోంది. బుధవారం కూడా నొప్పి తీవ్రం కావడంతో ఇంట్లోని గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

దుష్టపాలనకు చరమగీతం పాడాలి


రామరాజుపల్లిలో మాట్లాడుతున్న సీతక్క


నీర్మాలలో ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

- ఏఐసీసీ కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క

దేవరుప్పుల: కేసీఆర్ పాలన నాటి నైజాం సర్కార్‌ను తలపిస్తోంది.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వ దుష్టపాలనకు చరమగీతం పాడడం ఖాయమని ఏఐసీసీ కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే ధనసరి సీతక్క అన్నారు. దేవరుప్పుల మండలం రామరాజుపల్లిలో తలపెట్టిన కాంగ్రెస్ సంకల్పయాత్రలో భాగంగా గురువారం సింగరాజుపల్లిలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రామరాజుపల్లిలో 'కాంగ్రెస్ గ్యారంటీ ఆరు పథకాల'పై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమరుల ఆశయాలను పక్కనపెట్టిన కేసీఆర్ తన కొడుకు కేటీఆర్‌కు పట్టాభిషేకం చేసేందుకు తహతహలాడిపోతున్నారన్నారు. అవినీతి పాలనతో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, పేదలకు ఉచిత విద్య, వైద్యాన్ని విస్మరించారని ధ్వజమెత్తారు. మంత్రి దయాకర్‌రావు తన పదవి కాపాడుకోవడం తప్ప ప్రజల మౌలిక వసతులపై శ్రద్ధ పెట్టడంలేదని విమర్శించారు. ఉద్యమాలకు నిలయమైన పాలకుర్తిలో ప్రజాస్వామికవాదులు, ప్రతిపక్ష నాయకుల మీద కేసులు పెట్టి పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్న మంత్రి ఎర్రబెల్లి.. ములుగు నియోజకవర్గానికి వచ్చి నీతులు చెప్పడం సిగ్గుచేటన్నారు. ఆయన కోవర్టు రాజకీయాలు ఇక చెల్లవన్నారు. స్థానికురాలు, సమాజ సేవకురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, పెద్ది కృష్ణమూర్తి, నల్ల శ్రీరామ్, గండిపెల్లి యాకయ్య, వంగాల మల్లారెడ్డి, ఇనుముల నాగరాజు, సజ్జన్, కాడబోయిన నాగరాజు, బోనగిరి యాకస్వామి, పురుషోత్తం కృష్ణ, రవీంద్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ శ్రేణులు బెంబేలెత్తుతున్నాయి

పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ స్కీంలతో బీఆర్ఎస్ శ్రేణులు బెంబేలెత్తుతున్నాయని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాలకు హనుమండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ 40 ఏళ్లుగా పాలకుర్తి, చెన్నూరు నియోజవర్గాల్లో ఒకే సామాజిక వర్గం రాజ్యమేలుతోందన్నారు. నియోకవర్గ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాలలు లేకపోవడం మంత్రి రాచరిక పాలనకు నిదర్శనమన్నారు. అంతకు ముందు సోమేశ్వర లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

నీర్మాలలో స్వల్ప ఘర్షణ..

దేవరుప్పుల : మండలం నీర్మాల గ్రామంలో కాంగ్రెస్ తలపెట్టిన సంకల్పయాత్ర సభలో గురువారం రాత్రి కాంగ్రెస్ నాయకుడు పెద్ది కృష్ణమూర్తి ప్రసంగిస్తుండగా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకునే యత్నం చేయడంతో స్వల్ప ఘర్షణకు దారి తీసింది. సభ కొనసాగే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ బంద్‌చేయడంతో జనరేటర్‌తో నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంత్రి దయాకర్‌రావుపై విమర్శలు చేస్తుండగా బీఆర్ఎస్ మండల నాయకుడు ఇంటి మల్లారెడ్డి ప్రతి విమర్శకు దిగడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. అనంతరం కొనసాగిన సభలో కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ సభను అడ్డుకునే దుశ్చర్యలు తగవని, ప్రతిపక్షాలను ప్రజల్లో తిరగనివ్వకుండా నిలువరించే చర్యలను ప్రజాస్వామిక వాదులు ఖండించాలన్నారు. కాగా, ఘర్షణలో మల్లారెడ్డి, చిరంజీవికి గాయాలు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.